క్లుప్తంగా

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



వాజేడు : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్‌లు చాతాళ్ల రమేష్, తడుగుల విజయ్, పుల్లూరి కరుణాకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ ఆవరణలో మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెన్నం స్వామి ఆధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 7న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాజీలేని పోరాటంతోనే తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ జరుగుతుందన్నారు. సమావేశంలో వావిలాల స్వామి, లేగల రవి, చిట్యాల రాజేష్, జ్యోతి, రాజు తదితరులు ఉన్నారు.

పరామర్శ



ఏటూరునాగారం : సాక్షి దినపత్రిక రిపోర్టర్ భూక్య సునీల్‌నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, గోవింద్ నాయక్ మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రదీప్‌రావు, రమేష్, సత్యనారాయణ, మోహన్, స్వామి, బాబు, ఆదిరెడ్డి, ఓదేలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

వెంకటాపురం(కె) : మండల కేంద్రానికి చెందిన దివంగత టీడీపీ నాయకుడు అత్మకూరి సూరిబాబు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిరుపేద విద్యార్థుల చదువుల నిమిత్తం రమేష్ సాయం అందజేశారు. గ్రామస్తులు లక్ష్మణరావు, పట్టాభి, సాంబశివరావు, రవి, లక్ష్మీనారాయణ సత్తిబాబు ఉన్నారు.

'అసెంబ్లీ నియోజక వర్గంగా ఏర్పాటు చేయాలి'

వెంకటాపురం(కె) : త్వరలో ఏర్పాటు చేయనున్న అసెంబ్లీ నియోజక వర్గాల ఏర్పాటులో వెంకటాపురం మండల కేంద్రంగా అసెంబ్లీ నియోజక వర్గాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడీ ఈశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. భద్రాచలం, ములుగు నియోజక వర్గాలకు మధ్యలో ఉండి అభివృద్ధికి దూరంగా ఉన్న వెంకటాపురం మండలం అభివృద్ధి చెందాలంటే నియోజక వర్గం మండల కేంద్రంగా చేయాలని అన్నారు.

రాళ్లవాగు వంతెన పనులు త్వరగా పూర్తిచేయాలి

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని ఎదిర గ్రామ సమీపంలో కుంగిపోయిన రాళ్లవాగు వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు మంగళవారం అన్నారు. రాళ్లవాగు వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు.

సన్మానం

మంగపేట: చుంచుపల్లి పీహెచ్‌సీలో పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్‌ఎన్)గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఎలమంచిలి శైలజను పీహెచ్‌సీ వైద్యాధికారి యమున, సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు మంగళవారం సన్మానించారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కాటారం : ప్రజలు ప్రభుత్వాలు అందజేస్తున్న ఆర్థిక, సామాజిక భద్రతా పథకాలను వినియోగించుకోవాలని ఎల్‌డీఎం తిరుపతి అన్నారు. మండలంలోని అంకుషాపూర్‌లో మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాటారం శాఖ ఆధ్వర్యంలో జన సురక్షా ప్రచార కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం బ్యాంక్ ద్వారా అమలు చేస్తున్న ఆర్థిక, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి జనధన్ యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలను ప్రజలకు వివరించారు. ఖాతాదారుల కేవైసీ పునరుద్ధరణ, నూతన నమోదు చేపట్టారు. ప్రతి లబ్ధిదారుడికి భద్రతా పథకాల పరిధిని చేరవేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు ఎల్‌డీఎం తెలిపారు. కాటారం ఎస్‌బీఐ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టడవిలా ప్రకృతి వనాలు



అడవిని తలపిస్తున్న కోటగడ్డ పల్లె ప్రకృతి వనం



చల్వాయిలో నిరుపయోగంగా ఆటవస్తువులు



పాపయ్యపల్లి ప్రకృతి వనంలో ఖాళీ మద్యం సీసాలు

ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

- కాగితాలకే పరిమితమైన ప్రగతి నివేదికలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

గోవిందరావుపేట : గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాల నిర్వహణలో అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. హరిత తెలంగాణగా మార్చాలనే లక్ష్యంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2021లో ప్రతి గ్రామానికి పల్లె ప్రకృతి, బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి మొక్కలు నాటి వాటి నిర్వహణను గ్రామ పంచాయతీలకు అప్పగించింది. ప్రభుత్వ, అటవీ భూముల వెసులుబాటును బట్టి ఎకరం నుంచి ఐదెకరాల భూమిని సేకరించి మొక్కలు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు ఈజీఎస్, గ్రామ పంచాయతీ, హరితహారం పేరుతో నిధులు మంజూరు చేసి ప్రతి గ్రామంలోని పల్లె ప్రకృతి వనాల్లో నీడనిచ్చే చెట్లతో పాటు పండ్ల మొక్కలు, ప్రకృతి అందాల నిచ్చే మొక్కలను నాటారు. ఇక్కడి వరకు బాగానే ఉన్న ప్రభుత్వం లక్ష్యం ఆచరణలో అధికారుల చిత్తశుద్ధి లోపించి లక్ష్యం నీరుగారినట్లు అనిపిస్తుంది. పంచాయతీ కార్యదర్శుల నిర్వహణ లేకపోవడంతో నాలుగేళ్లుగా పల్లె ప్రకృతి వనాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. మండలంలోని అన్ని పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలు నేడు నిరాదారణకు గురై వెలవెలబోతున్నాయి. అధికారుల తీరు మాత్రం ఏదో మొక్కలు నాటామా..! వదిలేశామా..! అన్నట్లుగా కనిపిస్తుంది. పల్లె ప్రకృతి వనాలను కాపాడటానికి ప్రభుత్వాలు ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, నీటి ట్యాంకర్‌ని అందించినా నిరుపయోగంగానే ఉన్నాయి.

మండలంలో 36 పల్లె ప్రకృతి వనాలు

గోవిందరావుపేట మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో వాటి హాబిటేషన్‌లో 36 పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అందుకు ఈజీఎస్ నుంచి సుమారు రూ.32లక్షలు ఖర్చు చేశారు. మొక్కల కొనుగోలుకు 18 గ్రామ పంచాయతీల్లో సుమారుగా 7 లక్షల 40 వేలు నిధులు ఖర్చు చేసినట్లు సమాచారం.

ఖర్చు చేసి..గాలికి వదిలేసి..!

పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు కోట్లు, లక్షలు ఖర్చు చేసిన ప్రభుత్వం వాటి నిర్వహణలో శ్రద్ధ చూపకపోవడంతో ప్రస్తుతం పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్నాయి. ఆహ్లాదాన్ని పంచిన పల్లె ప్రకృతి వనాలు అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డగా మారిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించి పల్లె ప్రకృతి వనాలకు పూర్వ వైభవాన్ని తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కల సంరక్షణ చేపడుతాం..



పంచాయతీ కార్యదర్శులకు పల్లె ప్రకృతి వనాలను నిర్లక్ష్యం చేయవద్దని చెప్పాం. నిధుల కొరత వల్ల పల్లె ప్రకృతి వనాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలను సంరక్షించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. గేట్లను కొందరు ఓపెన్ చేసి అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– ఎం.మమత, ఎంపీడీఓ

వరదలపై అప్రమత్తంగా ఉండాలి



లైఫ్‌జాకెట్లు చూపిస్తున్న డీపీఓ దేవరాజ్

- డీపీఓ దేవరాజ్

ఏటూరునాగారం: వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీపీఓ దేవరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వరదలు, విపత్తులు, వాగులు, గోదావరి ఉప్పొంగి ప్రవహించినప్పుడు ఎలా ఎదుర్కోవాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో డీపీఓ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తులతో ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేకంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను స్థానికంగా వైటీసీలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ ముఖేష్, జగదీశ్‌ల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలకు విపత్తు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలనే పలు అంశాలపై ట్రైనింగ్ ఇచ్చినట్లు వివరించారు. రెవెన్యూ, గ్రామ పంచాయతీ, స్థానిక యువకులు, మత్స్యకారులు సైతం విపత్తులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. శిథిలమైన భవనాలు, ఇళ్లు ఉంటే గుర్తించడం జరుగుతుందన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే స్థానిక పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. లైఫ్ జాకెట్లు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. కిందిస్థాయి సిబ్బంది వాటిని ఎలా ఉపయోగించాలనే వాటిపై ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఓ దేవరాజ్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఏటూరునాగారం : పాఠశాల ఆవరణ, పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులను పంచాయతీ కార్యదర్శి రమాదేవి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ పాఠశాలను ఆమె పరిశీలించారు. గదులు, మూత్రశాలలు ఏ విధంగా ఉన్నాయని తనిఖీ చేశారు. పాఠశాల ఎదుట ఉన్న కాల్వలను శుభ్రం చేసి చెత్తాచెదారం లేకుండా చేయించారు. కాల్వల్లో ప్లాస్టిక్, చెత్తాచెదారం వేయొద్దని ప్రజలకు వివరించారు. గ్రామ పంచాయతీ ద్వారా రోజు చెత్త సేకరించడానికి ట్రాక్టర్ వస్తుందని, అందులో వేయాలని అవగాహన కల్పించారు. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.



కాల్వను శుభ్రం చేయిస్తున్న కార్యదర్శి రమాదేవి

పేదలకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

ఏటూరునాగారం : డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి పేదలకు కేటాయించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు కోరారు. ఈ మేరకు మంగళవారం పేదల కోసం 2017లో నిర్మించిన భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని వెంటనే వాటికి మరమ్మతు చేయించాలని లక్ష్మీనర్సింహరావు అన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులతో కలిసి జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఏటూరు నాగారం గ్రామంలోని 4వ వార్డులో 51 మంది దళితులకు ఇళ్లను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ద్వారా అప్పటి నుంచి ఇప్పటివరకు ఇళ్లు పూర్తి కాలేదని చెప్పారు. కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యంతో 70శాతం ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, ఇంకా 30 శాతం పూర్తి కాలేదని తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహరావు, బాధితులు

నోట్‌బుక్స్ పంపిణీ



గోవిందరావుపేట : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వీరపనేని డాంగే మంగళవారం ఉచితంగా నోట్‌బుక్స్ అందజేశారు. వీరపనేని రామదాసు-వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు డాంగే విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు.అధ్యాపకులు వెంకన్న, గణపతి, కార్తీక్ రెడ్డి, శోభారాణి, సతీష్, అనురాధ, రజీయా, సుకన్య, నివ్యశ్రీ, తైసిన్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

గోవిందరావుపేట : సీసీ కెమెరాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో నేరాలను నియంత్రించవచ్చని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ తెలిపారు. మండల పరిధిలోని చల్వాయి గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం వ్యాపారస్తులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఎంత గానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామంలోని వ్యాపారస్తులు వారి షాపులకు అనుసంధానంగా తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసులు, గ్రామస్తులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

వెంకటాపురం(కె) : కాచి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యాధికారి జ్యోతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నూగూరు గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మండ కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో 53మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 18మంది నుంచి రక్తన మూనాలు సేకరించి పరీక్షల కోసం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆశీష్, పవన్, మనోహర్, సిబ్బంది సత్యనారాయణ, రామలక్ష్మి, యాకలక్ష్మి తదితరులు ఉన్నారు.



నూగూరులో వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగపేట : మండలంలోని తిమ్మంపేట, బోరునర్సాపురం గ్రామాల మధ్య ఉప్పలనర్సయ్య చెరువు కట్టమైసమ్మ గుడి సమీపంలో మంగళవారం కారు, బైక్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బోరునర్సాపురం గ్రామానికి చెందిన జాగటి చిన్న, ఎల్‌పీ రమేశ్‌తో కలిసి వారి స్నేహితుడిని బైక్‌పై మల్లూరుకు వెళ్లి అతడిని అక్కడ వదిలి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో కట్టమైసమ్మ ఆలయానికి సమీపంలో మంగపేట నుంచి మణుగూరు వైపు వెళ్తున్న కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైక్‌పై ఉన్న చిన్న, రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన ఇద్దరిని ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులను పరిశీలించి ఇద్దరి కాలు విరిగినట్లు ధ్రువీకరించారు. వైద్యం కోసం ఎంజీఎంకు రెఫర్ చేసినట్లు సమాచారం.

అనుమతి ఉంటేనే 'ఇందిరమ్మ' ఇసుక

వాజేడు : ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్ ద్వారా అనుమతి ఉంటేనే ఇసుక ఇవ్వబడుతుందని వాజేడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ట్రాక్టర్ యజమానులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించిన గుర్తింపు పొందిన ఇసుక ర్యాంపుల ద్వారానే ఇసుక తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. అందుకు గాను ఆయా క్వారీల పరిధిలోని ట్రాక్టర్ యజమానులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.



యజమానులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

వైద్యులకు ఘన సన్మానం



ములుగు రూరల్: డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

వాజేడు : వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులను మంగళవారం సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులు మధుకర్, మహేందర్‌లకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఆశ కార్యకర్తలు వైద్యులకు పూలబొకేలతో అభినందించారు. కోటి రెడ్డి, శేఖర్, చిన్న వెంకటేశ్వర్లు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలో డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్లకు సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు హాజరయ్యారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, వైద్యాధికారులు ప్రవీణ మోహనరావు, ఉషారాణి, రాజు, కవిత, నిఖిల్, భరత్ రెడ్డి, లయిన్స్ క్లబ్ కార్యదర్శి రమేష్, కోశాధికారి రాజు తదితరులు ఉన్నారు.



వాజేడు: వైద్యులను సన్మానిస్తున్న సిబ్బంది

ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉండాలి



వాజేడు: ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు



మంగపేట: ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న వైద్యాధికారి యమున

వాజేడు : ఆశ కార్యకర్తలు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్యులు మధుకర్, మహేందర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం ఆశ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆశ కార్యకర్తలు వారానికి రెండ్రోజులు డ్రై డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా జ్వరం, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే నిర్వహించాలి

మంగపేట : ఆశ కార్యక్తలు ప్రతి రోజు ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున సూచించారు. మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీలో ఆశ డే సందర్భంగా వైద్యాధికారి యమున ఆయా సబ్‌సెంటర్ల పరిధిలోని ఆశ వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆశ కార్యకర్తలు వారి గ్రామాల్లో ప్రతి రోజు డ్రై డే, ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి రక్త పరీక్షలను నిర్వహించి పీహెచ్‌సీకి పంపించాలని సూచించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలను ప్రత్యేకంగా గమనించాలన్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీల అధికారులు, సిబ్బంది సహకారంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు సాంబలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి వైద్యశిబిరాలు

మల్హర్ : సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఈనెల 3వ తేదీ నుంచి (గురువారం) ఈనెల 29 వరకు మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి వినయ్‌భాస్కర్ తెలిపారు. మండల కేంద్రం తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో సూపర్‌వైజర్స్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో మంగళవారం మెడికల్ క్యాంపుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 3న రుద్రారం, 4న తాడిచర్ల, 7న కొయ్యూరు, 8న అన్నారంపల్లి, 10న పెద్దతూండ్ల, 11న మల్లారం, 14న వల్లెకుంట, 15న చిన్న తూండ్ల, 17న కొండంపేట, 18న నాచారం, 21న దుబ్బపేట, 22న అడ్వాలపల్లి, 24న మల్లెంపల్లి, 25న ఎడ్లపల్లి, 28న తాడిచర్ల-2, 29న పాత రుద్రారంలో వైద్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వినయ్

రాజేశ్వర్‌రావు సేవలు అభినందనీయం

ఎస్ఎస్‌తాడ్వాయి : సమ్మక్క-సారాలమ్మ జాతరలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన రాజేశ్వర్‌రావు సేవలు అభినందనీయమని మేడారం ఈఓ వీరస్వామి అన్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీవిరమణ పొందిన సందర్భంగా మంగళవారం హనుమకొండలోని సమ్మక్క-సారక్క ధార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా రాజేశ్వర్‌రావు దంపతులను ఈఓ వీరస్వామి, మేడారం సిబ్బంది శాలువాలతో సన్మానించి పూలమాలతో సత్కరించారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, జూనియర్ అసిస్టెంట్ జగదీశ్, మధు, బాలకృష్ణ, రికార్డు అసిస్టెంట్ వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఈఓ వీరస్వామి